సాక్షి
పెద్దపల్లి
గురువారం : 7 : నవంబర్ : 2024



బాక్సింగ్‌లో గోల్డ్‌మెడలిస్టులు

ఓదెల: కనగర్తిలోని దాసరి పద్మ–హన్మయ్య హైస్కూల్ విద్యార్థులు ముద్దమల్ల అజయ్, ఇట్ట వేణ శ్రీనిత, వేల్పుల అక్షయ, వేల్పుల అక్షిత బాక్సింగ్‌లో బంగారు పతకాలు సాధించారు.



వెలుగుల సూరీడు ఎన్టీపీసీ

జ్యోతినగర్ : విద్యుత్ ఉత్పత్తి రంగంలో తనకంటూ ప్రత్యేకత చాటుకుంటున్న ఎన్టీపీసీ గురువారం 50వ వసంతంలో అడుగు పెట్టబోతోంది. - 10లో▸

గరిష్టం/కనిష్టం
33.0/21.0

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. పగటి పూట ఎండగా, ఉక్కబోతగా ఉంటుంది. సాయంత్రం చలితీవ్రత పెరిగే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నాణ్యమైన ధాన్యానికే 'మద్దతు'



ధాన్యం పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ వేణు

ఎలిగేడు/సుల్తానాబాద్ రూరల్(పెద్దపల్లి): కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చే నాణ్యమైన ధాన్యాన్ని మద్దతు ధరకు సేకరించాలని అదనపు కలెక్టర్ వేణు సూచించారు. ఎలిగేడు, గర్రెపల్లి, భూతిపూర్‌లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం ఆయన సందర్శించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. కొనుగోలు కేంద్రానికి రైతులు రోజూ తసుకొచ్చే ధాన్యం, రైతుల సంఖ్య, తేమ తదితర వివరాలన్నీ రిజిష్టర్‌లో నమోదు చేయాలని సూచించారు. రైతులకు ఏమాత్రం నష్టం వాటిల్లకుండా వేగంగా కొనుగోలు చేయాలని ఆదేశించారు. జిల్లా పౌర సరఫరాల మేనేజర్ శ్రీకాంత్, ఎలిగేడు సింగిల్‌విండో చైర్మన్ గోపు విజయ భాస్కర్‌రెడ్డి, మండల వ్యవసాయాధికారి ఉమాపతి, సీఈవో కేశెట్టి విక్రమ్ పాల్గొన్నారు.

వ్యవసాయానికి మెరుగైన విద్యుత్ సరఫరా



ర్యాకల్‌దేవుపల్లిలో విద్యుత్ అధికారుల పొలంబాట

ఎలిగేడు(పెద్దపల్లి): వ్యవసాయ రంగంలో సమస్యలు తెలుసుకుని నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకే తాము పొలంబాట చేపట్టామని ట్రాన్స్‌కో ఎస్ఈ బొంకూరి సుదర్శన్, పెద్దపల్లి డీఈ తిరుపతి తెలిపారు. ర్యాకల్‌దేవుపల్లిలో బుధవారం వారు పొలంబాట నిర్వహించారు. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు, సరఫరా, ఇతర సమస్యలను తమ దృష్టికి తీసుకొస్తే తక్షణమే పరిష్కరిస్తామని అన్నారు. సుల్తానాబాద్ ఏడీ వెంకటేశ్వర్లు, ఎలిగేడు ఏఈ సంపత్‌కుమార్, లైన్‌మెన్ గున్నాల భాస్కర్, లైన్ ఇన్‌స్పెక్టర్ సూర్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

గొల్లపల్లిలో పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభం



కొనుగోళ్లు ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్ వేణు

కమాన్‌పూర్(మంథని): గొల్లపల్లి శివారులోని పరమేశ్వర కాటన్ మిల్లులో సీసీఐ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రాన్ని అదనపు కలెక్టర్ వేణు బుధవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ, 8శాతం తేమ ఉన్న పత్తి క్వింటాలుకు రూ.7,521 మద్దతు ధర లభిస్తుందన్నారు. రైతులు 8శాతం – 12శాతం వరకు తేమ ఉన్న పత్తిని తీసుకొచ్చి మద్దతు ధర పొందాలని సూచించారు. జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రవీణ్‌రెడ్డి, ఏఎంసీ కార్యదర్శి సురేందర్, సీసీఐ అధికారి గజేంద్ర తైవాడే, రైతు సంఘం నాయకులు శశిభూషణ్ కాచే, మిల్లు యాజమాన్య రాజ్‌కుమార్ అగర్వాల్, కృష్ణ అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.

29న ప్రజాభిప్రాయ సేకరణ



ప్రభుత్వ జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాల

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ రామగుండంలో చేపట్టే ఒక్కోటి 800 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం గల 3 యూనిట్ల సూపర్ థర్మవర్ పవర్ ప్రాజెక్టుపై ఈనెల 29న ప్రజాభిప్రాయం సేకరిస్తారు. ఈమేరకు ఎన్టీపీసీ సహకారంతో పర్యావరణ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఎన్టీపీసీలోని ప్రభుత్వ జిల్లా ప్రజాపరిషత్ పాఠశాల క్రీడా మైదానంలో ప్రజాభిప్రాయం సేకరిస్తారు. ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.29,344.85 కోట్లుగా ఎన్టీపీసీ బోర్డు డైరెక్టర్లు ఇటీవల నిర్ధారించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



అభినందిస్తున్న ప్రిన్సిపాల్, పీఈటీలు

ధర్మారం(ధర్మపురి): స్థానిక మోడల్ స్కూల్ (ఆదర్శ పాఠశాల) విద్యార్థులు ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్, హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్ బుధవారం తెలిపారు. వైష్ణవి, హేమలత, ఐలేశ్వరి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక కాగా, వైశాలి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ఆయన వివరించారు. ప్రతిభ చూపిన విద్యార్థులను ప్రిన్సిపాల్‌తోపాటు పీఈటీలు కొమురయ్య, సంజీవరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

సర్వే మరింత ఆలస్యం

జిల్లాలో పెరుగుతున్న నివాసాల సంఖ్య

- ఇంకో ఐదు వేలకు చేరుకోవచ్చని అంచనా
- ఇప్పటివరకు జిల్లాకు చేరని తాజా సర్వే ఫామ్స్
- సాంకేతిక సమస్యలు కారణమంటున్న అధికారులు
- ఈనెలాఖరులోగా సర్వే పూర్తిచేయాలని కలెక్టర్ ఆదేశం

సాక్షి ఫోటోగ్రాఫర్



కలెక్టరేట్‌లోని కలెక్టర్ కోయ శ్రీహర్ష నివాసానికి బుధవారం స్టిక్కర్ అతికిస్తున్న సర్వే అధికారులు

పెద్దపల్లిరూరల్: సాంకేతిక సమస్యలా లేక రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయమా తెలీదు కానీ, జిల్లాలో బుధవారం ప్రారంభించాల్సిన ఇంటింటి సమగ్ర కులగణన సర్వే మరింత జాప్యమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. తొలిదశలో అధికారులు చేస్తున్న ఇళ్లకు స్టిక్కరింగ్ ప్రక్రియ చివరి దశకు చేరుకుంటుందని భావిస్తున్న తరుణంలోనే మరికొన్ని కొత్తనివాసాలు వెలుగులోకి వస్తుండడం సర్వత్రా ఆందోళన కలిగిస్తోంది. మరోవైపు.. తమ ఇళ్లకు అధికారులు ఎప్పుడు వస్తారో, తాము ఇంటి వద్ద లేకుంటే ఎదురయ్యే పరిస్థితి ఏమిటో తెలియక జిల్లావాసులు సతమతమవుతున్నారు.

జిల్లాలో 2.50 లక్షల నివాసాలు..

కలెక్టరేట్‌లోని కలెక్టర్ కోయ శ్రీహర్ష నివాసానికి సంబంధిత అధికారులు బుధవారం స్టిక్కర్ అంటించారు. జిల్లాలోని 14 మండలాలతో పాటు రామగుండం కార్పొరేషన్, పెద్దపల్లి, సుల్తానాబాద్, మంథని మున్సిపాలిటీల పరిధిలో సుమారు 2.50 లక్షల ఇళ్లు ఉన్నట్లు అధికారులు అంచనా వేశారు. అయితే బుధవారం నాటికి 2.56 వేల నివాసాలకు స్టిక్కర్లు వేసినట్లు అధికారవర్గాలు తెలిపాయి. ఈ సంఖ్య మరో నాలుగైదు వేలు పెరిగే అవకాశం కూడా ఉందని వారు చెబుతున్నారు.

పక్కాగా.. పకడ్బందీగా నమోదు కోసం..

సామాజిక, ఆర్థిక, విద్య ఉపాధి, రాజకీయ కులగణనకు సంబంధించిన సమాచారం పక్కాగా, పకడ్బందీగా నమోదు చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఇప్పటికే కలెక్టర్ కోయ శ్రీహర్ష పలుమార్లు సంబంధిత శాఖల అధికారులు, సిబ్బందితో సమావేశమై పలు సూచనలిచ్చారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, ఏఎన్‌ఎంలు, ఈజీఎస్ టెక్నికల్ అసిస్టెంట్లతోపాటు ఉపాధ్యాయులు సర్వేలో పాలుపంచుకుంటారు.

1,800 బ్లాకులు.. 2 వేల మంది ఎన్యూమరేటర్లు

జిల్లా వ్యాప్తంగా సర్వే చేసేందుకు వీలుగా మొత్తం 1,800 బ్లాకులు ఏర్పాటు చేశారు. ఇప్పటివరకు గుర్తించిన దాదాపు 2.6 లక్షల ఇళ్లలో నివాసం ఉండే కుటుంబాల సమాచారం సేకరిస్తారు. ఇందుకోసం సుమారు 2 వేల మంది ఎన్యూమరేటర్లు ఇంటింటికీ వెళ్తారు. అయితే, ఏ రోజు, ఏ గ్రామం, ఏ వార్డు, ఏ సమయంలో సర్వే చేపట్టనున్నారనే సమాచారాన్ని ముందే ఆయా ప్రాంతాల్లోని కుటుంబ సభ్యులకు తెలియజేస్తారని అధికారులు చెబుతున్నా.. సర్వే ఎప్పుడు ప్రారంభిస్తారనే విషయం తెలియక జిల్లావాసులు తలలు పట్టుకుంటున్నారు.

ఎస్జీటీలకు బాధ్యతలు..

ఒక్కో ఎన్యూమరేటర్‌కు తన పరిధిలోని 150 ఇళ్లను గుర్తించి స్టిక్కర్ అతికించే బాధ్యత అప్పగించారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో పనిచేసే 400 మంది ఎస్జీటీలకు సర్వే పనులు అప్పగించారు. ఆ పాఠశాలలకు మధ్యాహ్నం పూట సెలవు ప్రకటించారు. ఎన్యూమరేటర్లు ఇంటింటికీ వెళ్లి సేకరించిన సమాచారాన్ని రోజువారీగా ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు ఆపరేటర్లను కూడా నియమించారు. నమోదు ప్రక్రియపై వారికి శిక్షణ సైతం ఇచ్చారు. మరోవైపు.. ఇప్పటికే సర్వే అధికారులకు అందించిన సర్వేఫామ్స్ స్థానంలో కొత్తవి ముద్రిస్తారని, అందులో మరో ఒకట్రెండు కాలమ్స్ చేర్చుతారని విశ్వసనీయంగా తెలిసింది. కానీ, ఈ ఫామ్స్ ఎప్పుడు ముద్రిస్తారు? జిల్లాకు ఎప్పుడు చేరుతాయనే అంశంపై అధికారులు కూడా స్పష్టత ఇవ్వడంలేదు.

జిల్లా సమాచారం

జనాభా(2011 జనాభా లెక్కల ప్రకారం)	7,95,332
మొత్తం కుటుంబాలు	2,50,000
విభజించిన బ్లాకులు	1,800
నియమించిన సూపర్‌వైజర్లు	214
సర్వేలో పాల్గొనే ఎన్యూమరేటర్లు	2,000

పక్కాగా వివరాల నమోదు

జిల్లాలో సమగ్ర సర్వే చేసే ఎన్యూమరేటర్లు ఇంటింటికీ వెళ్లి సమాచారం పక్కాగా నమోదు చేసేలా అవగాహన కల్పించాం. సర్వే సమయాల్లో క్రాస్‌చెక్ చేయాలని 10 మంది అధికారులను కూడా ఆదేశించాం. ప్రజలు సైతం సర్వేకు వచ్చే అధికారులకు తమ పూర్తి వివరాలను తెయజేయాలి. ఇందుకోసం ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, ధరణి పాసుపుస్తకాలు తదితర వివరాలతో సిద్ధంగా ఉండాలి.

– కోయ శ్రీహర్ష, కలెక్టర్

'పుడా' సాధనకు మద్దతు ఇవ్వండి

- పెద్దపల్లి బార్ అసోసియేషన్ ప్రతినిధులకు 'సాధన సమితి' వినతి



వినతిపత్రం అందిస్తున్న పుడా సాధన సమితి సభ్యులు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ సాధనకు సాగుతున్న పోరాటానికి పెద్దపల్లి బార్ అసోసియేషన్ సభ్యులు(న్యాయవాదులు) మద్దతు ఇవ్వాలని 'పుడా' సాధన సమితి నాయకులు బి.రమేశ్‌గౌడ్, బొంకూరి సురేందర్ సన్నీ, కావేటి రాజ్‌గోపాల్, తూముల శ్రీనివాస్ కోరారు. ఈమేరకు పెద్దపల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లకిడి భాస్కర్, కార్యదర్శి వాసు, సీనియర్ న్యాయవాది ఉప్పురాజు తదితరులను బుధవారం వారు జిల్లా కేంద్రంలో కలిసి ఒక వినతిపత్రం అందించారు. పార్లమెంట్, డివిజన్, అసెంబ్లీ కేంద్రంగా ఉన్న పెద్దపల్లి ఇప్పుడు జిల్లాగా అవతరించిందన్నారు. అయినా, పాలకులు అన్యాయమే చేస్తున్నారని వారు ఆరోపించారు. జిల్లా కేంద్రం హోదాకు తగిన విధంగా కనీస అభివృద్ధికి నోచుకోవడం లేదని పేర్కొన్నారు. 'పుడా'ను పెద్దపల్లిలోనే ఏర్పాటు చేసి జిల్లా అభివృద్ధికి తోడ్పాటు అందించాలని వారు కోరారు. ఇందుకు పెద్దపల్లి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు సంపూర్ణ మద్దతు ఇవ్వాలని వారు కోరారు. నాయకులు బొంకూరి సంతోష్ బాబ్జీ, బర్ల రమేశ్‌బాబు, పుట్ట రవి, మమత, ఝాన్సీ, దోనేటి కిష్టయ్య, 'పుడా' నేతలు రామ్మూర్తి, రాజేందర్, రవి, అంజయ్య, వినయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మంథనిలో మంత్రి శ్రీధర్‌బాబు పర్యటన



మంథని: రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు గురువారం మంథని నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించనున్నారు. మంథనిలో జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ఆధ్వర్యంలో రూ.75లక్షలతో చేపట్టిన నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు. అలాగే మల్హర్ మండలం కొండంపేట గ్రామంలో పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంత్రి ప్రారంభించనున్నారు. కాటారంలో ఏర్పాటు చేసిన ఆగ్రో ఇండస్ట్రీస్‌ను, అలాగే ఆత్మీయ సన్మాన కార్యక్రమంలో మంత్రి పాల్గొననున్నారు.

జాతీయస్థాయి విలువిద్య పోటీలకు ఎంపిక



యశ్వంత్‌ను అభినందిస్తున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లిరూరల్/ఎలిగేడు: జిల్లాలోని ఎలిగేడు మండలం సుల్తాన్‌పూర్ గ్రామానికి చెందిన ఆర్చరీ క్రీడాకారుడు తానిపర్తి యశ్వంత్ జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఇటీవల మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురులో జరిగిన రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీల్లో ప్రతిభ చూపి మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకం సాధించాడు. బుధవారం కలెక్టరేట్‌లో ఆర్చరీ క్రీడాకారుడు యశ్వంత్‌ను కలెక్టర్ కోయ శ్రీహర్ష అభినందించారు. ఈనెల 11, 12వ తేదీల్లో గుజరాత్‌లోని నాథ్‌యాడ్‌లో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనేందుకు అవకాశం దక్కించుకోవడం అభినందనీయమన్నారు. ఆ పోటీల్లోనూ మంచి ప్రతిభ కనబర్చాలని కలెక్టర్ ఆకాంక్షించారు.

ముగ్గురు సీఐల బదిలీ

గోదావరిఖని: రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో ముగ్గురు సీఐలను బదిలీ చేస్తూ మల్టీజోన్ –వన్ ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. నిజామాబాద్‌లో సీఐగా పనిచేస్తున్న కె.పురుషోత్తం రామగుండం ట్రాఫిక్ పోలీసుస్టేషన్‌కు బదిలీ అయ్యారు. అదేవిధంగా మల్టీజోన్-1లో విధులు నిర్వర్తిస్తున్న వై.చంద్రశేఖర్‌గౌడ్ రామగుండం ఐటీ సెల్‌కు, జి.సతీశ్ రామగుండం సీసీఆర్‌బీకి బదిలీ అయ్యారు. బదిలీ ఉత్వర్వులు వెంటనే అమల్లోకి వస్తాయని అందులో పేర్కొన్నారు.

టెన్త్‌లో సత్ఫలితాలు సాధించాలి

- ఆయిల్‌పామ్ సాగుతో అధిక ఆదాయం
- రైతులను ప్రోత్సహించాలి
- కలెక్టర్ కోయ శ్రీహర్ష



మాట్లాడుతున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లిరూరల్: పదో తరగతి పరీక్షల్లో ప్రభుత్వ పాఠశాలలు మంచి ఫలితాలు సాధించాలని, విద్యార్థులు 10 జీపీఏ సాధించేలా ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో కలెక్టరేట్‌లో బుధవారం ఆయన పదో తరగతి పరీక్షలు, ఫలితాల సాధనపై సమీక్షించారు. ఆరు నుంచి తొమ్మిదో తరగతి విద్యార్థుల కోసం అమలు చేస్తున్న ఎల్ఐపీని పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. హైస్కూల్ విద్యార్థులను సబ్జెక్ట్ టీచర్లు దత్తత తీసుకుని పరీక్షలకు సిద్ధం చేయాలని సూచించారు. డీఈవో మాధవి, సమన్వయకర్త పీఎం షేక్ తదితరులు ఉన్నారు.

చెకుముకి పోస్టర్ ఆవిష్కరణ

జన విజ్ఞానవేదిక చేపట్టే చెకుముకి సైన్స్ సంబరాలు– 2024 ప్రచార పోస్టర్‌ను కలెక్టర్ కోయ శ్రీహర్ష తన కార్యాలయంలో బుధవారం ఆవిష్కరించారు. సైన్స్‌పై విద్యార్థుల్లో అవగాహన కల్పించడం, మూఢనమ్మకాలను తొలగించడం దీని ఉద్దేశమని కలెక్టర్ అన్నారు. డీఈవో మాధవి, పీఎంషేక్, జన విజ్ఞానవేదిక ప్రతినిధి నాగేశ్వర్‌రావుతోపాటు గద్దె శ్రీనివాస్, కాంపల్లి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

సర్వేకు అందరూ సహకరించాలి

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): ఇంటింటి కుటుంబ సర్వేకు అందరూ సహకరించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష కోరారు. పెగడపల్లిలో చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే స్టిక్కరింగ్ తీరును ఆయన పరిశీలించారు. ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రంలో ధాన్యం సేకరణ తీరుపై ఆరా తీశారు. పెగడపల్లి, గంగారం, కాల్వశ్రీరాంపూర్ జెడ్పీ హైస్కూళ్లలో విద్యార్థులను కలిశారు. వారికి పలు సూచనలు చేశారు. అనంతరం పెద్దరాతుపల్లిలో చేపట్టిన ఆయిల్ పామ్ ప్రాజెక్టు నిర్మాణ ప్రగతిని పరిశీలించారు. అధిక ఆదాయం కోసం రైతులు ఆయిల్‌పామ్ సాగు చేయాలన్నారు. ఇందుకోసం రైతులను ప్రోత్సహించాలని కంపెనీ సీఈవో శేఖ్‌కల్యాణ్‌కర్‌కు సూచించారు. డీసీవో శ్రీమాల, తహసీల్దార్ వకీల్, ఎంపీడీవో రామ్మోహనాచారి, ఏవో నాగార్జున, ఏపీఎం కనుకయ్య, కంపెనీ ప్రతినిధి శ్రీనివాస్ పాల్గొన్నారు.

జాగ్రత్తగా చెత్త తరలించండి

- అదనపు కలెక్టర్ అరుణశ్రీ



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ అరుణశ్రీ

కోల్‌సిటీ(రామగుండం): చెత్తను తరలించే సమయంలో కింద పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అదనపు కలెక్టర్, బల్దియా కమిషనర్(ఎఫ్ఏసీ) అరుణశ్రీ ఆదేశించారు. రామగుండం నగరపాలక సంస్థ కార్యాలయంలో బుధవారం పారిశుధ్య వాహనాల డ్రైవర్లతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరించాలని ఆమె సూచించారు. సమయపాలన పాటించడంతోపాటు 100శాతం ప్రతీ ఇంటి నుంచి చెత్త సేకరించాలని పేర్కొన్నారు. చెత్త బయట పడేస్తున్న వారికి జరిమానా విధించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో నగరపాలక సంస్థ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రామన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు నాగభూషణం, సునీల్, హెల్త్ అసిస్టెంట్ సునీల్ పాల్గొన్నారు.

ఆశపడితే మోసపోతారు

- వృద్ధులు, రిటైర్డ్ ఉద్యోగులే సైబర్ నేరగాళ్ల లక్ష్యం
- రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ వెల్లడి




మాట్లాడుతున్న సీపీ శ్రీనివాస్

జ్యోతినగర్(రామగుండం): వృద్ధులు, రిటైర్డ్ ఉద్యోగులు లక్ష్యంగా సైబర్ నేరగాళ్లు ఫోన్‌కాల్స్‌తో ఏవేవో ఆశలు చూపుతున్నారని, వారిని నమ్మి వ్యక్తిగత, బ్యాంకు ఖాతా తదితర సమాచారం అందిస్తే మోసపోతారని రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ అన్నారు. ఎన్టీపీసీ మిలీనియం హాల్‌లో బుధవారం నిర్వహించిన 'సైబర్ జాగృకత దివస్'లో సీపీ మాట్లాడారు. డీజీ శిఖా గోయల్ ఆదేశాల మేరకు సైబర్ క్రైమ్ ఏసీపీ వెంకటరమణ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ఒంటరిగా ఉండే వృద్ధులను లక్ష్యంగా చేసుకుని సైబర్ నేరగాళ్లు ఫోన్లుచేస్తూ ప్రేమగా పలకరిస్తూ తర్వాత సైబర్ నేరాలకు పాల్పడుతున్నారని సీపీ అన్నారు. ఉద్యోగ విరమణ తర్వాత వీరి బ్యాంకు ఖాతాల్లో పెద్దమొత్తంలో డబ్బు ఉంటుందని భావిస్తూ దుండగులు వృద్ధులను టార్గెట్ చేస్తున్నారని, సీనియర్ సిటిజన్లు అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు. ఒకవేళ మోసపోతే వెంటనే 1930 నంబరుకు ఫోన్ చేయాలని ఆయన సూచించారు. క్రెడిట్, డెబిట్ కార్డ్ నంబర్‌లు, పాస్‌వర్డ్‌లు, ఓటీపీలు ఎవరికీ ఇవ్వకూడదని ఆయన పేర్కొన్నారు. ఉచితాలపై ఆశలు పెంచుకోవద్దని, బీమా పథకాల్లో చేరే సమయంలోనూ అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. సామాజిక మాధ్యమాల వినియోగంలోనూ జాగరూకతతో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో గోదావరిఖని ఏసీపీ రమేశ్, రామగుండం సీఐ ప్రవీణ్‌కుమార్, ఎన్టీపీసీ ఎస్సై సతీశ్, సీనియర్ సిటిజన్లు పీటీ స్వామి, ఎల్.రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

వడ్లు పండించిన రైతుకే బోనస్

- సన్నరకం ధాన్యం క్వింటాలుకు రూ.500 అదనం
- నాణ్యమైన పత్తికి రూ.7,521 మద్దతు ధర
- సీసీఐ కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి
- పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు



నిమ్మనపల్లిలో సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

పెద్దపల్లిరూరల్: రైతులు కష్టపడి పండించిన సన్నరకం ధాన్యం క్వింటాలుకు మద్దతు ధరకు అదనంగా రూ.500 బోనస్ చెల్లిస్తామని పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. సింగిల్‌విండో చైర్మన్ నర్సింహారెడ్డి, వ్యవసాయ మార్కెట్ చైర్‌పర్సన్ ఈర్ల స్వరూపతో కలిసి బుధవారం నిట్టూరులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. కౌలు రైతుల బ్యాంకు ఖాతాల్లోనూ బోనస్ సొమ్ము జమచేసేలా వ్యవసాయాధికారులు సహకారం అందించాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో సీఈవో మెట్టు మదన్‌మోహన్, డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

సీసీఐ కేంద్రాల్లో మద్దతు ధర

పత్తి రైతులు నాణ్యమైన దిగుబడిని సీసీఐ కేంద్రాల్లో విక్రయించి క్వింటాలుకు మద్దతు ధర రూ.7,521 పొందాలని ఎమ్మెల్యే విజయరమణారావు సూచించారు. నిమ్మనపల్లి గ్రామంలోని జిన్నింగ్ మిల్లులో సీసీఐ కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. రైతు సంక్షేమానికి తమ ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని ఆయన తెలిపారు. డీఎంవో ప్రవీణ్‌రెడ్డి, మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి దేవ రాజ్‌పృథ్వీరాజ్ తదితరులు పాల్గొన్నారు.

కూల్చివేతలు ఆపేయండి

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్
- బల్దియా కార్యాలయాన్ని ముట్టడించిన గులాబీ శ్రేణులు
- ఆందోళనకారులను అడ్డుకున్న పోలీసులు.. ఇరువర్గాల మధ్య తోపులాట



ఆందోళనకారులను మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం నుంచి బయటకు తీసుకొస్తున్న పోలీసులు

కోల్‌సిటీ(రామగుండం): రామగుండం నగరపాలక సంస్థ పరిధిలో చేపట్టిన కూల్చివేతలను నిలివేయాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ డిమాండ్ చేశారు. బల్దియా పరిధిలో అక్రమ కట్టడాల పేరిట చేపట్టిన కూల్చివేతలను నిరసిస్తూ బుధవారం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయాన్ని మాజీ ఎమ్మెల్యేతోపాటు నగర డిప్యూటీ మేయర్ నడిపెల్లి అభిషేక్ రావు, బీఆర్ఎస్ కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు ముట్టడించారు. బల్దియా కార్యాలయం ఆవరణలో బైఠాయించారు. ప్రభుత్వం, అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఆందోళనకారులను బయటకు తీసుకొచ్చేందుకు వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి నేతృత్వంలో పోలీసులు ప్రయత్నించారు. దీంతో నాయకులు, పోలీసుల మధ్య ఒక్కసారిగా తోపులాట ప్రారంభమైంది. పోలీసులు ఆందోళనకారులను బలవంతంగా బల్దియా కార్యాలయం బయటకు లాక్కొచ్చారు. ఆ తర్వాత బల్దియా ముఖద్వారం ఎదుట బైఠాయించిన నిరసనకారులు.. సర్కారు అనుసరిస్తున్న తీరుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కోరుకంటి చందర్ మాట్లాడుతూ, బీఆర్ఎస్ పార్టీకి చెందిన నాయకులను కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు టార్గెట్ చేసి ఆస్తులను కూల్చివేస్తున్నారన్నారు. అధికారులు కూడా కాంగ్రెస్ పార్టీ నాయకులు చెప్పినట్లు నడుచుకోవడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. కట్టడాలను కూల్చివేస్తూ చిరువ్యాపారులు, నిరుపేదలను రోడ్డున పడేస్తున్నారని, ఇదేనా కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొస్తామని చెప్పిన మార్పు అని ఎద్దేవా చేశారు. గాంధీచౌక్ చౌరస్తాలో నిర్మిస్తున్న దుకాణాల తరహాలోనే మిగిలిన చిరువ్యారులకు షెడ్లు కట్టించిన తర్వాతనే కూల్చివేతలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఇష్టానుసారంగా కూల్చివేతలకు పాల్పడితే తగిన మూల్యం చెల్లించుకోతప్పదని ఆయన హెచ్చరించారు. కొన్నిచోట్ల అనుమతులు ఉన్న వాటిని కూడా అన్యాయంగా కూల్చివేస్తున్నారని, ఇలాంటి ధోరణి మార్చుకోకపోతే ప్రజలతో కలిసి ఆందోళనలు ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. అనంతరం అసిస్టెంట్ కమిషనర్ రాజలింగుకు వినతిపత్రాన్ని సమర్పించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు పెంట రాజేశ్, పాముకుంట్ల భాస్కర్, కల్వచర్ల కృష్ణవేణి, బాదె అంజలి, అయిత శివకుమార్, కవితసరోజిని, శ్రీనివాస్, నాయకులు అచ్చ వేణు, నారాయణదాసు మారుతి, బొడ్డుపల్లి శ్రీనివాస్, తోకల రమేశ్, నూతి తిరుపతి, ముద్దసాని సంధ్యారాణి పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకులపై కేసు

గోదావరిఖని: మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో చొరబడి అధికారుల విధులకు ఆటంకం కలిగించిన 33 మంది బీఆర్ఎస్ నాయకులపై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ ఎస్సై రమేశ్ తెలిపారు. అడ్డగుంటపల్లిలోని సిరి ఫంక్షన్‌హాల్‌ను అక్రమంగా నిర్మించి, నాలాను ఆక్రమించారనే కారణంతో బల్దియా అధికారులు వాటిని తొలిగించారని పేర్కొన్నారు. దీనికి నిరసనగా బీఆర్ఎస్ శ్రేణులు దౌర్జన్యంగా బల్దియా కార్యాలయంలో ప్రవేశించి అధికారులు, ప్రజలను ఇబ్బందులకు గురిచేశారన్నారు. కమిషనర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నాయకులు తిరుపతి, రాజేశ్, వేణుతోపాటు మరో 30మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

క్లుప్తంగా

స్వగ్రామానికి చేరిన మృతదేహం


అశోక్ (ఫైల్)

రాయికల్: గల్ఫ్‌లో చనిపోయిన మండలంలోని ఒడ్డె లింగాపూర్‌కు చెందిన పాలకుర్తి అశోక్ (30) మృతదేహం బుధవారం ఆయన స్వగ్రామానికి చేరింది. ఉపాధి నిమిత్తం మస్కట్ వెళ్లిన ఆయన గతనెల 20న గుండెపోటుతో మృతిచెందాడు. ఆయన శవం స్వగ్రామం చేరడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.

మహిళను ఢీకొట్టిన లారీ

- పరిస్థితి విషమం


గాయపడిన మహిళ

సిరిసిల్లక్రైం: సిరిసిల్లలోని కొండా లక్ష్మణ్ బాపూజీ చౌరస్తా వద్ద నడుచుకుంటూ వెళ్తున్న మహిళను బుధవారం రాత్రి లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో గాయపడ్డ మహిళను గమనించిన స్థానికులు 108 అంబులెన్స్‌లో సిరిసిల్ల ఆస్పత్రికి తరలించారు. సిరిసిల్ల ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మహిళ పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. ఆమె ఆచూకీ తెలియాల్సి ఉంది.

ఎస్సై శ్వేత సస్పెన్షన్ ఎత్తివేత

- డీసీఆర్బీ ఎస్సైగా నియామకం

జగిత్యాలక్రైం: కోరుట్ల–2 ఎస్సైగా పనిచేసిన శ్వేత ఇటీవల సస్పెన్షన్ కాగా.. విచారణ అనంతరం మల్టీజోన్–1 ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి ఆమె సస్పెన్షన్ ఎత్తివేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఆమెను జగిత్యాల డీసీఆర్బీ ఎస్సైగా నియమించారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

- కుటుంబ సమస్యలతో గడ్డిమందు తాగిన వైనం
- మూడు నెలల వ్యవధిలో అక్కాతమ్ముడి బలవన్మరణం


చందన్ కుమార్ (ఫైల్)

మల్యాల(చొప్పదండి): కుటుంబ సమస్యలతో మూడు నెలల క్రితం అక్కడ ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. అదే కుటుంబ సమస్యలతో తాజాగా తమ్ముడు కూడా గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకోగా.. చికిత్స పొందుతూ బుధవారం చోటుచేసుకుంది. ఈ ఘటన మల్యాల మండల కేంద్రంలో విషాదం నిపింది. స్థానికుల కథనం ప్రకారం.. మండలకేంద్రానికి చెందిన బైరి చందన్, లావణ్య అక్కాతమ్ముళ్లు. లావణ్యకు వివాహమైంది. కుటుంబ సమస్యలతో ఆమె మూడు నెలల క్రితం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. అప్పటినుంచి మనస్తాపంతో ఉన్న తమ్ముడు చందన్‌కుమార్ గత నెల 19న మల్లెగుట్ట పరిసరాల్లో గడ్డి మందుతాగి పడిపోయాడు. స్థానికులు గమనించి హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. మూడునెలల వ్యవధిలోనే అక్కాతమ్ముళ్లు మృతిచెందడంతో కుటుంబ సభ్యులు హృదయ విదారకంగా రోదించారు. చందన్‌కుమార్‌కు భార్య, కుమారుడు, కూతురు సంతానం.

ఇసుక తరలిస్తున్న లారీ పట్టివేత


పట్టుబడిన ఇసుక లారీ

మెట్‌పల్లి: కథలా పూర్ మండలం నుంచి నిజామాబాద్‌కు ఇసుకను అక్రమంగా తరలిస్తున్న లారీని రెవెన్యూ అధికారులు బుధవారం పట్టుకున్నారు. స్థానిక వట్టివాగు వద్ద రెవెన్యూ సిబ్బంది తనిఖీ చేస్తుండగా.. అటు వైపు వచ్చిన ఓ లారీ అనుమానాస్పదంగా కనిపించింది. అందులో ఇసుక ఉండడంతో డ్రైవర్ అలకుంట కుమార్‌ను అనుమతులపై ప్రశ్నించగా.. లేవని బదులిచ్చాడు. వెంటనే లారీని పోలీసులకు అప్పగించి ఫిర్యాదు చేశారు. లారీ యాజమాని, డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. కథలాపూర్ మండలంలోని ఓ వాగు నుంచి కొంతకాలంగా నిజామాబాద్‌కు పెద్ద ఎత్తున ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. అయినా అక్కడి పోలీస్, రెవెన్యూ అధికారులు అడ్డుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.

ఉమ్మడి జిల్లా బాస్కెట్‌బాల్ కోచ్‌గా అజీమ్


అజీమ్

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలం కండ్లపల్లి మోడల్‌స్కూల్ పీడీ అజీమ్ ఉమ్మడి జిల్లా బాస్కెట్‌బాల్ కోచ్‌గా నియమితులయ్యారు. ఈనెల 8 నుంచి 10 వరకు మహబూబ్‌నగర్ జిల్లాలో జరగనున్న ఎస్జీఎఫ్ అండర్–19 బాలబాలికల బాస్కెట్‌బాల్ పోటీలకు ఉమ్మడి కరీంనగర్ జిల్లా జట్టుకు కోచ్‌గా వ్యవహరించనున్నారు. అజీమ్‌ను బుధవారం పాఠశాల ప్రిన్సిపాల్ సరితాదేవి, వైస్ ప్రిన్సిపాల్ నరేశ్, ఉపాధ్యాయులు అభినందించారు.

వెలుగుల సూరీడు ఎన్టీపీసీ

- 97 విద్యుత్ కేంద్రాలు.. 76,475.68 మెగావాట్లు
- విద్యుత్ ఉత్పత్తిలో ప్రపంచస్థాయి నాణ్యతా ప్రమాణాలు
- నేడు థర్మల్ విద్యుత్ ప్రాజెక్టు ఆవిర్భావ దినోత్సవం

జ్యోతినగర్(రామగుండం): అందుబాటులోకి వస్తున్న అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం అందిపుచ్చుకుంటూ.. పర్యావరణ పరిరక్షణ ధ్యేయంగా ముందుకు సాగుతున్న నేషనల్ థర్మల్ పవర్ ప్రాజెక్ట్(ఎన్టీపీసీ) అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యుత్ ఉత్పత్తి చేస్తోంది. భారతావనికి వెలుగులు అందిస్తోంది. గురువారం 50వ వసంతంలోకి అడుగుపెడుతున్న ఎన్టీపీసీ.. దేశవ్యాప్తంగా 97 ప్రాజెక్టుల్లో 76,475.68 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేస్తోంది. అంతేకాదు.. 2032 నాటికి 1,30,000 మెగావాట్ల నిర్దేశిత విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంతో కొత్త ప్రాజెక్టులకు శ్రీకారం చుడుతూ శరవేగంగా దూసుకుపోతోంది. ఎన్టీపీసీలో ప్రస్తుతం 17,794 మంది ఉద్యోగులు అహర్నిశలు శ్రమిస్తున్నారు.

విద్యుత్ కొరతను అధిగమిస్తూ..

స్వాతంత్ర్యం తర్వాత మనదేశం తీవ్రమైన విద్యుత్ కొరత ఎదుర్కొంది. అయితే, కేంద్రప్రభుత్వం ఆధ్వర్యంలో ఒక పవర్ ప్రాజెక్టు ఉండలనే అప్పటి ప్రభుత్వ లక్ష్యం మేరకు ఢిల్లీ ఎలక్ట్రిసిటీ బోర్డుకు చెందిన బదర్‌పూర్ థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని టేకోవర్ చేసింది. 1975 నవంబర్ 7న ఎన్టీపీసీ రిజిస్ట్రార్ అఫ్ కంపెనీస్ నమోదు చేసింది. ఆ తర్వాత జాతీయ థర్మల్ విద్యుత్ కేంద్రంగా రూపాంతరం చెందింది. అప్పటివరకు ఉన్న విద్యుత్ కొరతను అధిగమిస్తూ ముందుకు సాగుతోంది.

దినదినాభివృద్ధి..

దేశంలో బొగ్గు గనులు, గ్యాస్, నీరు, స్థలం అనుకూలంగా ఉన్న ప్రాంతాలను గుర్తిస్తూ ఎన్టీపీసీ విద్యుత్ ప్రాజెక్టుల నెలకొల్పుతూ వస్తోంది. దేశంలోనే ఇప్పుడు అతిపెద్ద విద్యుత్ కేంద్రంగా ఎదిగింది. ప్రపంచస్థాయి విద్యుత్ సంస్థలతో పోటీపడుతోంది. ప్రభుత్వ రంగ సంస్థల్లో పవర్ ప్లాంట్ సామర్థ్యం, పీఎల్ఎఫ్, నిర్వహణ, విధానాలు, రక్షణ, పొదుపు, పర్యావరణ సమతుల్యం విధానాలతో అగ్రస్థానంలో నిలిచింది. విద్యుత్ ఉత్పత్తిలో అగ్రభాగాన నిలవడంతో నవరత్న కంపెనీగా పేరుగాంచింది. 2010లో మహారత్న కంపెనీగా రూపాంతరం చెందింది.


ఎన్టీపీసీ రామగుండం-తెలంగాణ ప్రాజెక్టు

ఎన్టీపీసీ ప్రాజెక్టులు, ఉత్పత్తి వివరాలు..

ప్రాజెక్టు	ప్లాంట్లు	ఉత్పత్తి సామర్థ్యం (మెగావాట్లు-సుమారు)
కోల్	27	53,850
గ్యాస్/లిక్విడ్ ఇంధనం	7	4,017
హైడ్రో	1	800
స్మాల్ హైడ్రో	1	8
సోలార్ పీవీ	16	493
జాయింట్ వెంచర్స్‌తో..		
కోల్	9	8,344
గ్యాస్/లిక్విడ్	4	2,494
హైడ్రో	8	2,925
స్మాల్ హైడ్రో	1	24
సోలార్ పీవీ	19	3,307.68
విండ్	4	213

అనేక పద్ధతుల్లో విద్యుత్ ఉత్పత్తి..

ఎన్టీపీసీ సొంతంగా బొగ్గు, గ్యాస్, హైడ్రో, సోలార్, ఫ్లోటింగ్ తదితర పద్ధతుల్లో విద్యుత్ ఉత్పత్తి చేస్తోంది. సొంతంగానా, జాయింట్ వెంచర్స్‌తో కలిపి 97 పవర్ ప్రాజెక్టులను కలిగి ఉంది. 76,475.68 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేస్తూ దేశంలోనే అగ్రగామిగా నిలిచింది. సూపర్ క్రిటికల్ మెగా ప్రాజెక్టులు నిర్మిస్తూ ప్రస్థానం కొనసాగిస్తోంది. తన వ్యాపారాన్ని బలోపేతం చేయడానికి, కన్సల్టెన్సీ, పవర్ ట్రేడింగ్, విద్యుత్ నిపుణుల శిక్షణ, బొగ్గు తవ్వకాల్లో వైవిధ్యభరితంగా వ్యవహరిస్తోంది. మైనింగ్ రంగంలోనూ వేగవంతమైన ప్రగతి సొంతం చేసుకుంటోంది.

దేశ, విదేశాల్లో..

ఒకప్పుడు మనదేశంలో విద్యుత్ మాత్రమే ఉత్పత్తి చేసిన ఎన్టీపీసీ.. భవిష్యత్ అవసరాలు, పోటీని ఎదుర్కొనేందుకు ఉత్పత్తి, పంపిణీ, కొనుగోలు, విక్రయాలు, సొంతంగా బొగ్గు గనుల తవ్వకాలు చేపట్టాలని ప్రణాళిక రూపొందించుకుంది. పలు కంపెనీలతో కలిసి జాయింట్ వెంచరర్లతోనూ వ్యాపారాలు చేస్తోంది. బంగ్లాదేశ్, భూటాన్, శ్రీలంక దేశాల్లో అక్కడి దేశాల భాగస్వామ్యంతో జాయింట్ వెంచర్లతో విద్యుత్ ప్రాజెక్టులు నిర్మిస్తోంది. భవిష్యత్‌లో అణు విద్యుత్ తయారీ కేంద్రాలూ స్థాపించాలని తహతహలాడుతోంది.

శిలాజ ఇంధన ఆధారిత ఉత్పత్తిలో..

వచ్చే 2032 నాటికి శిలాజ ఇంధనం ఆధారిత విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం సాధించాలని ఎన్టీపీసీ తన పోర్ట్‌పోలియోలో నిర్దేశించుకుంది. ఇందులో దాదాపు 25శాతం వాటా ఉంటుందని భావిస్తోంది. ఎన్టీపీసీ తన ప్లాంట్లను ఇప్పటికే అధిక సామర్థ్య స్థాయిల్లో నిర్వహిస్తోంది. జాతీయ సామర్థ్యంలో 17.0శాతం కలిగి ఉండటంతోపాటు అధిక సామర్థ్యంపై దృష్టి సారించింది. కంపెనీ ‘పీపుల్ బిఫోర్ ప్లాంట్ లోడ్ ఫ్యాక్టర్’ మంత్రం ద్వారా మార్గనిర్దేశం చేసుకుంది. మానవ వనరుల సంబంధిత విధానాల్లో గ్రేట్ ప్లేస్ టు వర్క్, ఎకనామిక్ టైమ్స్ సర్వేలో మనదేశంలో పని చేయడానికి అత్యుత్తమ 50 ఉత్తమ కంపెనీల్లో స్థిరంగా ర్యాంక్‌ని పొందింది. దీనికిగాను ఎన్టీపీసీ అవార్డెడ్ గ్రహీతగా గుర్తింపు పొందింది.

కారు ఇవ్వడానికి రూ.30వేల లంచం!

- నిబంధనలకు విరుద్ధంగా అదుపులో ఉంచుకున్న ఎస్సై
- నెలపాటు స్టేషన్ చుట్టూ తిరిగిన బాధితుడు
- ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో వదిలేసిన వైనం



మెట్‌పల్లి: ఆయన మెట్‌పల్లి పోలీస్ సర్కిల్‌లోని ఓ ఠాణాలో ఎస్సై. అక్కడ బాధ్యతలు చేపట్టిన వెంటనే అసాంఘిక శక్తులపై కఠినంగా వ్యవహరించి శభాష్ అనిపించుకున్నారు. అదంతా ఆయనలో ఒకవైపు మాత్రమేనని త్వరగానే తేలిపోయింది. కేసులు నమోదు చేసే విషయంలో కిరికిరి పెడుతూ ఫిర్యాదుదారుల నుంచి కాసులు దండుకుంటాడనే విమర్శలు ఉన్నాయి. ఇటీవల స్టేషన్‌లో జరిగిన ఓ సంఘటన ఆయనలో ఉన్న లంచావతారానికి అద్దం పడుతోంది. వివరాల్లోకి వెళితే... ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలానికి చెందిన శంకర్ అనే వ్యక్తి గ్రామంలో వ్యవసాయం చేయడంతోపాటు సొంతకారును అద్దెకు నడుపుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. సెప్టెంబర్ 25న కారు మరమ్మతు చేయించడానికి మెట్‌పల్లి సర్కిల్‌లోని ఓ షెడ్డుకు వచ్చాడు. మరమ్మతు చేయించుకుని తిరిగి వెళ్తుండగా.. మార్గమధ్యంలో ఓ వ్యక్తి ద్విచక్రవాహనంతో ఢీ కొట్టాడు. ఈ ఘటనలో కారు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టుకు తగలడంతో ముందు భాగం దెబ్బతింది. దీంతో అతడు వెంటనే అదే కారులో పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి సదరు ఎస్సైకి ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేయకుండా ఎస్సై కారును స్టేషన్‌లోనే పెట్టుకుని శంకర్‌ను మరుసటి రోజు రమ్మని చెప్పి పంపించివేశాడు. తర్వాతి రోజు వెళ్లినా ఎస్సై నుంచి స్పందన రాలేదు. మరోరోజు వెళ్లి కలవగా.. ‘నీ కన్నా ముందే ద్విచక్ర వాహనదారుడు ఫిర్యాదు చేశాడు. దానిపై కేసు నమోదు చేశాం. కారును ఇవ్వాలంటే రూ.30వేలు ఇవ్వాల్సిందే..’ అంటూ అతడిలోని నైజాన్ని బయటపెట్టాడు. దీనికి శంకర్ తాను అంత మొత్తం ఇచ్చే పరిస్థితిలో లేనని, ప్రమాదంలో తన తప్పేమీ లేదని చెప్పినప్పటికీ కారును విడిచి పెట్టడానికి మాత్రం ఎస్సై ఒప్పుకోలేదు. కొన్నిరోజులు స్టేషన్ చుట్టూ తిరిగిన శంకర్.. గత్యంతరం లేక రూ.20వేలు ఇస్తానని చెప్పాడు. దానికీ ఎస్సై అంగీకరించలేదు. విసుగు చెందిన శంకర్ కలెక్టరేట్‌లో ప్రజావాణిలో, ఎస్పీ కార్యాలయంలో ఎస్సైపై ఫిర్యాదు చేశాడు. విషయాన్ని కార్యాలయం సిబ్బంది సబ్ డివిజన్ అధికారి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన సదరు ఎస్సైపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసి గత నెల 25న శంకర్‌కు కారు ఇప్పించాడు. అయితే నిబంధనల ప్రకారం ఈ కేసులో కారును ఎస్సై అదుపులో ఉంచుకోవడానికి వీలు లేదు. కానీ.. కేవలం డబ్బుల కోసం.. చట్టవిరుద్ధంగా నెలపాటు కారును అదుపులో ఉంచుకుని బాధితుడిని ముప్పుతిప్పలు పెట్టడం గమనార్హం. ప్రస్తుతం సదరు ఎస్సై వ్యవహారం సర్కిల్‌లో చర్చనీయాంశంగా మారింది.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి దుర్మరణం

- ఒకరికి తీవ్ర గాయాలు
- లారీని బైక్ ఢీకొట్టడంతో ఘటన


శ్రీహాస్ (ఫైల్)


సాయికృష్ణ (ఫైల్)

కరీంనగర్ క్రైం: లారీని బైక్ ఢీకొన్న ఘటనలో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతిచెందారు. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. కరీంనగర్ టూటౌన్ పోలీసుల వివరాల ప్రకారం.. కొత్తపల్లి మండలానికి చెందిన చిలుముల సాయికృష్ణ(23), వీణవంక మండలం చల్లూరుకు చెందిన తాండ్ర శ్రీహాస్(20), జగిత్యాల జిల్లా కథలాపూర్ మండలం తాండ్రియాలకు చెందిన మామిడిపల్లి నాగరాజు కరీంనగర్‌లోని ఎస్సారార్ సర్కిల్ వద్ద గల ఓ రెస్టారెంట్‌లో పని చేస్తున్నారు. మంగళవారం రాత్రి 11 గంటలకు విధులు ముగించుకొని, బైక్‌పై బస్టాండ్ వైపు వెళ్లారు. 2 గంటల సమయంలో బ్యాంక్‌కాలనీ సమీపంలోని శ్రీహాస్, నాగరాజు ఉండే గదికి బయలుదేరారు. సాయికృష్ణ బైక్ నడుపుతుండగా శ్రీహాస్, నాగరాజు వెనక కూర్చున్నారు. ఈ క్రమంలో లారీ డ్రైవర్ వెనక వచ్చే వారిని గమనించకుండా ఒక్కసారిగా వాహనాన్ని పక్కకు తిప్పాడు. దీంతో బైక్ లారీని ఢీకొట్టింది. లారీ ద్విచక్రవాహనాన్ని సుమారు 100 మీటర్ల దూరం ఈడ్చుకెళ్లడంతో సాయికృష్ణ అక్కడికక్కడే మృతిచెందాడు. ఆస్పత్రికి తరలిస్తుండగా శ్రీహాస్ చనిపోయాడు. తీవ్రంగా గాయపడిన నాగరాజును స్థానికులు ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. శ్రీహాస్‌కు తల్లిదండ్రులు స్వప్న-లక్ష్మణ్, ఒక చెల్లెలు ఉన్నారు. అతను ఓ ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ సెకండియర్ చదువుతున్నాడు. సాయికృష్ణకు తల్లిదండ్రులు శోభ-శంకర్, అన్న వంశీకృష్ణ ఉన్నారు. మృతుల కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. చేతికొచ్చిన కుమారులు మృతిచెందడంతో మృతుల తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. వారి బంధువులు, స్నేహితులు ప్రభుత్వ ఆస్పత్రికి పెద్ద ఎత్తున తరలివచ్చారు.

చర్యలు తీసుకోవాలి..

నగరంలో హోర్డింగ్‌లు ఏర్పాటు చేసే క్రమంలో పలు సంస్థలకు చెందిన లారీలు, ఇతర వాహనాల డ్రైవర్ల నిర్లక్ష్యం వల్లే ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు అంటున్నారు. ఎలాంటి రక్షణ చర్యలు తీసుకోకుండా పనులు చేస్తున్నవారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పట్టపగలే చైన్‌స్నాచర్ల హల్‌చల్

- మహిళ మెడలో నుంచి పుస్తెలతాడు అపహరణ


సీసీ కెమెరాలో నిందితులు

మెట్‌పల్లి: పట్టణంలోని 12వార్డు టీచర్స్‌కాలనీలో పట్టపగలే చైన్‌స్నాచర్లు రెచ్చిపోయారు. ఓ మహిళపై దాడి చేసి ఆమె మెడలో నుంచి పుస్తెలతాడును అపహరించుకుని వెళ్లిపోయారు. బాధితురాలు కందనవేని వాణి కథనం ప్రకారం.. బుధవారం మధ్యాహ్నం సమయంలో ఇంటి ఆవరణలో కూతురుకు అన్నం తినిపిస్తోంది. అప్పటికే వారి ఇంటి సమీపంలో ఇద్దరు యువకులు బైక్‌పై వచ్చి గమనిస్తున్నారు. కొద్దిసేపు తర్వాత ఓ యువకుడు నడుచుకుంటూ వెళ్లి ఆమె మెడలో ఉన్న పుస్తెలతాడును లాక్కెళ్లడానికి ప్రయత్నించాడు. వెంటనే అప్రమత్తమైన ఆమె అతడిని ప్రతిఘటించింది. ఆమెను బలంగా కిందకు తోసేసి మెడలో ఉన్న పుస్తెల తాడును లాక్కొని బైక్‌పై పారిపోయారు. పుస్తెల తాడు నాలుగు తులాలు ఉంటుందని బాధితురాలు వాపోయింది. సంఘటనా స్థలాన్ని సీఐ నిరంజన్ రెడ్డి పరిశీలించి బాధితురాలి నుంచి వివరాలు సేకరించారు. పరిసరాల్లోని సీసీ కెమెరాలు పరిశీలించారు. నిందితుల ఫొటోలను విడుదల చేశారు. నిందితులను గుర్తిస్తే తమకు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు. పట్టపగలే ఈ సంఘటన జరగడంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు.

ప్రాణం పోయినా దళితుల వెంటే..

- 9న ఇంటివద్దే ఉంటా.. దరఖాస్తులు ఇవ్వండి
- హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

హుజూరాబాద్‌రూరల్: దళితబంధు విషయంలో తన ప్రాణం పోయినా దళితుల వెంటే ఉంటానని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. హుజూరాబాద్‌లోని తన నివాసంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రెండో విడత దళిత బంధు సాయాన్ని గత బీఆర్ఎస్ ప్రభుత్వం దళితుల బ్యాంకు ఖాతాల్లో జమచేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం ఫ్రీజ్ చేసిందని ఆరోపించారు. మాజీ మంత్రి గంగుల కమలాకర్‌తోపాటు తనను కాంగ్రెస్ నాయకులు కావాలనే బద్నాం చేస్తున్నారని మండిపడ్డారు. ఈ నెల 9న ఇంటి వద్దే టెంట్ వేసుకొని ఉంటానని, రెండో విడత సాయం అందనివారు వచ్చి, దరఖాస్తులు ఇవ్వాలని సూచించారు. వాటిని కలెక్టర్ అందిస్తానని పేర్కొన్నారు. ప్రభుత్వం 40 శాతం మంది రైతులకే రూ.2 లక్షల రుణమాఫీ చేసిందని, మిగతా 60 శాతం మందికి వెంటనే చేయాలని డిమాండ్ చేశారు. రైతు పండించిన ప్రతీ ధాన్యం గింజను కొనుగోలు చేయాలని, బోనస్ చెల్లించాలన్నారు. బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి బండ శ్రీనివాస్, మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక, పార్టీ పట్టణ అధ్యక్షుడు కొలిపాక శ్రీనివాస్, మండల అధ్యక్షుడు సంగెం అయిలయ్య, కౌన్సిలర్లు అపరాధ ముత్యం రాజు, తాళ్లపల్లి శ్రీనివాస్, తొగరు సదానందం, మారపల్లి సుశీల, నాయకులు కొండ్ర నరేశ్, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

రాజన్నను దర్శించుకున్న పీఠాధీశ్వరులు


రాజన్న ప్రసాదం అందజేత

వేములవాడఅర్బన్: రాజన్నను బుధవారం ఆదిశంకర భగవత్పాద పరంపరాగత మూలామ్నాయ సర్వజ్ఞ పీఠాధీశ్వరులు శంకర విజయేంద్ర సరస్వతీ మహాస్వామి దర్శించుకున్నారు. అయోధ్య రామమందిరంలో త్వరలోనే శాశ్వత ప్రతిష్ఠ చేసే స్వర్ణతాపడం చేసిన 108 కిలోల శ్రీరామ మహాయంత్రం రథయాత్ర బుధవారం రాజన్న ఆలయానికి చేరుకుంది. ఈ సందర్భంగా స్వామీజీకి ఆలయ అర్చకులు రాజన్న ప్రసాదం అందించారు.


రథయాత్ర వద్ద స్వామివారి దర్శనం

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి


మాట్లాడుతున్న ఏసీపీ నర్సింహారెడ్డి

కరీంనగర్ క్రైం: సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని కరీంనగర్ సైబర్ క్రైం పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వో, ఏసీపీ నర్సింహా రెడ్డి అన్నారు. సైబర్ జాగృతి దివస్ సందర్భంగా బుధవారం కరీంనగర్ భగత్‌నగర్‌లోని బృందావన్ గార్డెన్‌లో రిటైర్డ్ ఉద్యోగులు, సీనియర్ సిటిజన్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరు సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. చాలామంది అపరిచితుల ఫోన్ కాల్స్, మెస్సేజ్‌లకు స్పందించి, తమ ఖాతాల్లోని డబ్బులు పోగొట్టుకుంటున్నారని పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే మోహన్ రెడ్డి, రిటైర్డ్ పోలీస్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు హరిప్రసాద్, రిటైర్డ్ ఉద్యోగ సంఘాల నాయకులు మోహన్ రెడ్డి, కేశవ రెడ్డి, రిటైర్డ్ డిఫెన్స్ అధికారి మోహన్ తదితరులు పాల్గొన్నారు.

‘రంగవల్లి’ యాదిలో విజ్ఞాన కేంద్రం

- 11న వేములవాడలో ప్రారంభోత్సవం
- ‘రంగవల్లి’ 25వ వర్ధంతి సభ


రంగవల్లి(ఫైల్)

సిరిసిల్ల: ‘ప్రజల కోసం జీవించడం ఆదర్శప్రాయం.. ప్రజల కోసం మరణించడం అజరామరం’ కామ్రేడ్ రంగవల్లి అలియాస్ లలితక్క యాదిలో ‘రంగవల్లి విజ్ఞాన కేంద్రం’ రూపుదిద్దుకుంటుంది. వేములవాడ నందికమాన్ వద్ద నవంబరు 11న విజ్ఞాన కేంద్రాన్ని ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈమేరకు బుధవారం కరపత్రాలను విడుదల చేశారు. నిజామాబాద్ జిల్లా వర్ని మండలం వకీలుఫారంలో 1959 డిసెంబరు 31న గిరిజ–ఎస్.వి.ఎల్.నర్సింహారావు దంపతులకు రంగవల్లి జన్మించింది. సీపీఐ(ఎంఎల్) జనశక్తి రాష్ట్ర కమిటీ సభ్యురాలిగా, వరంగల్ జిల్లా జనశక్తి పార్టీ కార్యదర్శిగా పనిచేస్తూ 1999 నవంబర్ 11న ములుగు జిల్లా జగ్గన్నగూడెం వద్ద జరిగిన ఎన్‌కౌంటర్‌లో రంగవల్లి మరణించారు. ఆమెతోపాటు జాన్‌రెడ్డి, చీపురు సంతోష్, వాంకుడోత్ అనితలు ఆ ఎన్‌కౌంటర్‌లో అసువులు బాశారు. రచయితగా.. ‘తోబుట్టువులు అమెరికాలో.. తాను కారడవిలో’ అంటూ రంగవల్లి తనపైనే రాసుకున్నారు. పీడీఎస్‌యూ నాయకురాలిగా, విజృంభన పత్రిక సంపాదకురాలిగా పనిచేశారు. రంగవల్లి నాన్న నర్సింహారావు బాన్సువాడ ఎమ్మెల్యేగా పనిచేశారు. ఆమె ఉన్నత చదువుల కోసం ఉస్మానియా యూనివర్సిటీలో చేరి ఎంఏ సైకాలజీ చేస్తూ.. వేములవాడకు చెందిన జనశక్తి ఉద్యమనేత కూర రాజన్న అలియాస్ రాజేందర్‌ను ప్రజా ఉద్యమంలోనే ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. వారికి ఒక్క కొడుకు ఉన్నారు. చిన్న ప్రాయంలోనే కొడుకును తల్లిదండ్రులకు అప్పగించి రంగవల్లి ఉద్యమబాట పట్టారు. ఈక్రమంలోనే ఆమె ఎన్‌కౌంటర్‌లో మరణించగా.. ఆ దంపతులు ఒక్కగానొక్క కొడుకు ప్రస్తుతం అమెరికాలో స్థిరపడ్డారు. రంగవల్లి మరణించి నవంబరు 11 నాటికి 25 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా వేములవాడలో రంగవల్లి విజ్ఞాన కేంద్రాన్ని ప్రారంభిస్తున్నారు.

గ్రంథాయల ప్రారంభోత్సవ వేడుకలు

వేములవాడ శివారులోని నందికమాన్ వద్ద రంగవల్లి విజ్ఞాన కేంద్రం(గ్రంథాలయాన్ని) ప్రారంభిస్తున్నారు. న్యాయవాది, హక్కుల కార్యకర్త లక్ష్మీదేవి ఈ గ్రంథాలయాన్ని ప్రారంభిస్తారు. అమరుల స్మృతిగీతం ఆవిష్కరణను చేస్తారు. స్మారకోపన్యాసాలు ఆచార్య కట్టా భగవంతరెడ్డి, ప్రొఫెసర్ కాశీం(ఓయూ), అరుణోదయ విమలక్క అధ్యక్షతన కార్యక్రమం నిర్వహిస్తారు. అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య పాటల కార్యక్రమాలు ఉంటాయి.

కోడెమొక్కులు.. కార్తీక పూజలు




వేములవాడఅర్బన్: రాజన్న ఆలయంలో కార్తీక మాసం సందర్భంగా సామూహిక కార్తీక దీపోత్సవంలో భాగంగా బుధవారం సాంస్కృతిక కార్యక్రమాలను ఏఈవో జయకుమారి ప్రారంభించారు. కోరెంకు చెందిన వేంకటేశ్వర భజన మండలి భజనగానం నిర్వహించారు. అనంతరం ఆలయం ఆవరణలో వివిధ రకాల ఆకృతులతో దీపాలు వెలిగించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారికి కోడెమొక్కులు చెల్లించి ప్రత్యేక పూజలు చేశారు.




గోదావరిలో ఘనంగా దీపోత్సవం


గోదావరి వద్ద పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

ధర్మపురి: ధర్మపురి వద్దగల గోదావరికి బుధవారం దీపోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్తీకమాసంలో భాగంగా ముందుగా ఆలయం నుంచి గోదావరి వరకు మేళతాళాలు, మంగళవాయిద్యాలతో వెళ్లారు. మహిళల కోలాట నృత్యాలతో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో శ్రీనివాస్, వేదపండితులు, అర్చకులు తదితరులున్నారు.